నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జులై 03, 2024 | www.navatelangana.com

విందుకని వెళ్లి వ్యక్తి మృతి

నవతెలంగాణ-సారంగాపూర్

విందుకని వెళ్లి వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన మంగళవారం అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కౌట్ల(బి) గ్రామస్తులు అడెల్లి పోచమ్మ దేవాలయం వద్ద పండగ చేశారు. ఈ విందుకు అదే గ్రామానికి చెందిన కాసారం భీమన్న(50) వెళ్లాడు. సమీప అటవీ ప్రాంతానికి మోదుకు ఆకులకు వెళ్లి రిజర్వు ఫారెస్ట్ కంచే దాటే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బండరాయిపై పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



ఈజ్‌గాంలో గుప్తనిధుల తవ్వకాలు

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాంలోని తాటివనం సమీపంలో గల పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయ స్థలంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల తవ్వకాలు చేపట్టారు. సమీప ఇంటి యజమాని బయటకు వచ్చి ఎందుకు తవ్వుతున్నారని ప్రశ్నించగా ఆమెను సైతం భయపెట్టి తవ్వకాలు చేపట్టినట్టు తెలుస్తోంది. గతంలో కూడా ఇదే స్థలంలో తవ్వకాలు చేపట్టినట్టు పోలీసులకు సైతం సమాచారం ఉంది. రాత్రి సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి ఆలయ స్థలంలోనే ఐదు ఫీట్ల లోతుతో తవ్వకాలు చేపట్టిన విషయం గ్రామంలో ప్రచారం జరిగింది.



ఖాకీల సెటిల్మెంట్లు..!

- జిల్లాలో పోలీసులపై పెరుగుతున్న అవినీతి ఆరోపణలు
- వివాదాస్పదంగా మారిన ఎస్ఐ ఆకస్మిక బదిలీ
- కొందరు పోలీసులు సెటిల్మెంట్లు, పైరవీలకే ప్రాధాన్యం

జిల్లాలో పోలీస్ శాఖపై అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. ఆ మధ్య కానిస్టేబుల్ స్థాయి నుండి ఎస్ఐ వరకు సస్పెండ్ అయినప్పటికీ మార్పు రావడం లేదు. భూ వివాదాల్లో తల దూరుస్తూ ఒక గ్రూపుకు సపోర్ట్ చేస్తూ మరో గ్రూపుపై బెదిరింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు నిత్యం జిల్లాలో విన్పిస్తున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో సెటిల్మెంట్‌లకు అలవాటు పడ్డారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. సిబ్బందిని గాడిలో పెట్టేందుకు అధికారులు ప్రత్యేక క్లాసులు, సంస్కరణలు చేపట్టినప్పటికీ కొందరు పోలీసులు అవేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వారికి ఉన్నతాధికారులు మెమోలు జారీ చేస్తున్నప్పటికీ ఈ తంతు మాత్రం మారడం లేదు. జిల్లాలో విత్తనాల అధిక రేటు విక్రయాలు, నకిలీ విత్తనాలు, పీడీఎస్ బియ్యం రవాణా జోరుగా సాగుతున్నప్పటికీ అదుపు చేసే స్పెషల్ టీం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు నామమాత్రపు దాడులు చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని పలు హోటల్స్, లాడ్జిలలో పేకాట, బెట్టింగ్ దందాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికీ అధికారులెవరూ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. దందాలకు ఉన్నతాధికారులే మద్దతు తెలపడంతో కింది స్థాయి ఉద్యోగులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాలలో పని చేస్తున్న ఎస్ఐ ఆకస్మిక బదిలీ చర్చనీయాంశంగా మారింది. గత నెలలో మంచిర్యాల లక్ష్మి టాకీస్ ఆవరణలో బీఆర్ఎస్ యువ నాయకుడిపై జరిగిన దాడి విషయంలో ఎస్ఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాడి చేసిన యువకులపై నామమాత్రపు కేసులు నమోదు చేసి వదిలేశారని తెలుస్తోంది. దాడి తీరును పరిశీలిస్తే నిందితులను రిమాండ్ చేయాల్సి ఉండేదని, దాడి విషయంలో కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఉన్నతాధికారులు ఎక్కడ సమస్య ఎదురవుతుందోనని భావించి ఎస్ఐని బదిలీ చేసినట్లు అటు పోలీస్ శాఖతో పాటు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

ఏప్రిల్ నెలలో మంచిర్యాల పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ మహిళ తన కూతురు ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు చేసే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పాప ఫొటోలు స్క్రీన్ షాట్ తీసుకొని వాటిని మార్ఫింగ్ చేసి తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసి 4 రోజులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఎన్ని సార్లు వచ్చినా పిటిషన్ మరోసారి రాసివ్వాలని స్టేషన్‌లో అధికారులు తెలపడంతో విసుగు చెందిన మహిళ డీసీపీని కలిసి గోడు వెళ్లబోసుకుంది. భర్త వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేసిన మరో మహిళా ఉద్యోగి పోలీసుల తీరుపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనే నిరసనకు దిగింది. తన భర్తతో సెటిల్మెంట్ చేసుకున్న పోలీసులు ఫిర్యాదు చేసిన తనపైనే అక్రమ కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే కొన్ని గ్రూపులకు మద్దతు తెలుపుతూ ఆ గ్రూపుకు చెందిన యువకులు ఎక్కడ అల్లర్లు, గొడవలు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదురవుతున్నాయి. అధికార పార్టీ మద్దతు యువకులకు ఉండడంతోనే సమస్య ఎందుకని భావించి ఆ గ్యాంగ్‌లకు పోలీసులు సహకరిస్తున్నట్లు జిల్లాలో చర్చ కొనసాగుతోంది.

కలకలం రేపుతున్న ఏసీబీ దాడులు

జిల్లాలో కొన్ని రోజులుగా ఏసీబీ అధికారుల విచారణ జరుగుతున్నట్లు సమాచారం. వైద్య, పోలీస్ శాఖతో పాటు పలు శాఖల్లో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్లు జిల్లాలో చర్చ మొదలైంది. పరిమితికి మించిన వైద్యం చేస్తున్నారని పలువురు ఆర్ఎంపిలపై పోలీస్‌స్టేషన్‌లలో విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. వారిపై విచారణ చేపట్టి అనుమతి లేకున్నా వైద్యం చేస్తున్నట్లు రుజువైతే రిమాండ్‌కు తరలించాలని విజిలెన్స్, టీఎస్ఎంసీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీన్ని అదునుగా తీసుకున్న కొందరు పోలీసులు కొందరు ఆర్ఎంపిలపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించకుండా చూసుకుంటామని బేరసారాలకు పాల్పడినట్టు సమాచారం. ఈ క్రమంలో మంచిర్యాల, లక్షెట్టిపేట, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్, జన్నారంలో ఆర్ఎంపీల వద్ద పోలీసులు ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మంచిర్యాల పట్టణ సీఐని వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, విజిలెన్స్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్ఎంపిలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

అధికారులెవరైనా వదిలేది లేదు : ఎం.శ్రీనివాస్, సీపీ, రామగుండం

అవినీతికి పాల్పడిన వ్యక్తులు ఎంతటి వారైనా వదిలేది లేదు. క్రమశిక్షణ కోల్పోయి చట్టానికి విరుద్ధంగా వ్యవహరించి పోలీస్ శాఖకు చెడ్డ పేరు తీసుకొచ్చే ఎంతటి పెద్ద అధికారులైన సరే చర్యలు తీసుకుంటాం. ఏసీబీ దాడులు జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. దానిపై విచారణ కొనసాగిస్తున్నాం. ఆర్ఎంపిల విషయంలో వస్తున్న ఆరోపణలపై విచారణ కొనసాగుతోంది. నేరం రుజువైతే చర్యలు తీసుకుంటాం. పోలీస్‌స్టేషన్ వివరాలు గోప్యంగా ఉంచకుండా, డ్యూటీలో నిర్లక్ష్యం వహించే అధికారులను కొన్ని సందర్భాల్లో ఆకస్మికంగా బదిలీ చేయడం సహజం. ఫిర్యాదు చేసే ప్రతి ఒక్కరూ పోలీస్‌స్టేషన్ నుండి రశీదు తీసుకోవాలి.



మద్యం మత్తులో పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నయ్య(59) మద్యం మత్తులో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..చిన్నయ్య కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఇంట్లోనే మద్యం మత్తులో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.



ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ - కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత నేతృత్వంలో కంటి వైద్యనిపుణులు వసీ పరీక్షలు నిర్వహించారు. 36 మంది పరీక్షలకు హాజరుకాగా 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని, వీరికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించనున్న ఈ ఉచిత కంటి వైద్యశిబిరానికి అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

నిర్మల్ : సోన్ మండలంలోని మాదాపూర్ ఎక్స్ రోడ్డు జాతీయ రహదారి నుంచి వయా పాక్‌పట్ల గ్రామం నుంచి గాంధీనగర్ వరకు రూ.14. కోట్ల నిధులతో రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో ఏర్పడిన గుంతలతో కూడిన రోడ్డుతో వాహనదారులకు ఎన్నో ఇబ్బందులు తలెత్తేవని, ప్రస్తుతం రెండు వరుసల రహదారి వేయడంతో సమస్య తీరుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సోన్ మండలం ఎంపీపీ మానస హరీశ్‌రెడ్డి, నాయకులు సరికేల గంగన్న, మార గంగారెడ్డి, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు ఘన సన్మానం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జీ ఎంపీడీఓ వెంకటరమేష్, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గత ఐదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఇకనుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు. సమావేశం అనంతరం ఎంపీపీ లలిత భోజన్న, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలను, అధికారులు ఘనంగా సన్మానించారు.

నామమాత్రపు ధరలకే అందుబాటులో మొక్కలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐటీడీఏ పరిధిలోని 4 ఉద్యాన నర్సరీలలో నాణ్యమైన మామిడి మొక్కలు, అలంకరణ మొక్కలు నామమాత్రపు ధరలకే అందుబాటులో ఉంచామని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, మంచిర్యాల జిల్లాలో భీమారం, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగా ఉద్యాన నర్సరీలలో ఆయా మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడి మొక్క రూ.50, క్రోటాన్స్, అలంకరణ మొక్కలు రూ.20, మునగ, కరివేపాకు మొక్కలు రూ.20 చొప్పున అవసరమైన రైతులకు, రైతు సంఘాలకు, స్వచ్ఛంద సంస్థలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఇంకా ఇతర రకాల మొక్కలు అవసరమున్నట్లయితే ఉత్పత్తి చేస్తామని తెలిపారు. వివరాలకు ఉద్యాన అధికారిని 9032313933 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు ఓపెన్ యూనివర్శిటి వార్షిక పరీక్షలు

కాగజ్‌నగర్ రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. ద్వితీయ సంవత్సరం సెమిస్టర్-4 విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు తమ ఒరిజినల్ హాల్ టికెట్ పాటు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

నేడు మండల సమావేశం

కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11.30గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేశ్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, అన్ని శాఖల అధికారులు సకాలంలో విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలకు అధికారులు వివరాలు అందజేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సాధించడం కోసం సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలు అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ కింద జిల్లాలో సంబంధిత శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ కార్యక్రమాల కింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల సంబంధిత పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుండి జూన్ 30 వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక అందించాలని, విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, ఆర్థిక చేకూర్పు 5 విభాగాలలో 39 అంశాలపై నిర్ణీత నమూనాలు సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి అందించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా పశు వైద్యాధికారి సురేష్, ఏపీడీ రామకృష్ణ, నీతి అయోగ్ జిల్లా సమన్వయకర్త మణివేలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని, దీనికోసం ఉచిత కోచింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ కోరారు. డివైఎఫ్ఐ యూత్ సర్వేలో భాగంగా మండలంలోని జెండాగూడలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు చాలామంది డిగ్రీలు పీజీలు చేసి ఉద్యోగం ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం పోటీ పరీక్షలు కోసం నోటిఫికేషన్లు ఇచ్చినప్పటికీ జిల్లాలలో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం లేదని, దీంతో యువత చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు పోసి పోటీ పరీక్షలకు చదువుతున్నారని, డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న పేద యువత ఇంట్లోనే ఉండి చదువుతున్నారన్నారు. ప్రభుత్వం జిల్లాలో చొరవ తీసుకొని కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్, జిల్లా సహా కార్యదర్శి ఆత్మకూరు సతీష్, వడ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేం

- పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్
- బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-కెరమెరి

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్ అన్నారు. గోయగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు విజేష్, స్వప్న విజయ, మురళి, గణేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించిన విద్యాకార్యక్రమాలను, విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్యనేర్పిన తీరుతెన్నులను గుర్తుచేసి ఉపాధ్యాయ వర్గంలో వారు ఆణిముత్యాలని ప్రశంసల జల్లు కురిపించారు. ఏ పాఠశాలలో పని చేసినా మన్ననలు పొందాలన్నారు. ఉద్యోగ జీవితాల్లో బదిలీలు సాధారణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల వికాసానికి చేసిన సేవలు అద్భుతమన్నారు.



బదిలీపై వెళ్తున్న పాఠశాలల్లో కూడా ఇలాగే కష్టపడి పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికోసం కృషి చేయాలన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని, అలాంటి మన దేశ భవిష్యత్తును మార్చే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నందున గర్వపడాలని, వారి సేవలను కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఝరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భరత్ ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని కలెక్టర్‌కు ఏఎన్ఎంల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

తమను రెగ్యులర్ చేసి మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని మంగళవారం ఈసీ ఏఎన్ఎంలు కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దూలం సత్యనారాయణరావు, ధారవేని సంతోష్‌కుమార్, రాష్ట్ర నాయకుడు నల్ల రవీందర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఈసీ స్కీమ్ ఏఎన్ఎంలను భేషరతుగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం(3194) నాయకులు ఆడే సురేష్, బొమ్మెత సుభాష్, సచిన్ దేశ్‌పాండే, ఈసీ ఏఎన్ఎంలు కె.నీలా, కె.సుధారాణి, శ్రీవాణి, సంగీత, ప్రియదర్శిని పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | జులై 03, 2024 | www.navatelangana.com

రమేష్ రాథోడ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్



మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ సంఘటన్ మంత్రి చంద్రశేఖర్ మంగళవారం పరామర్శించారు. రాథోడ్ రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, భూమన్న, జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం పాల్గొన్నారు.

అందరి సహకారం మరువలేనిది : ఎంపీపీ

ముధోల్ : మండలాభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారుల, ప్రజల సహకారం మరువలేనిదని ముధోల్ ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పదవీకాలం పూర్తి చేసుకుంటున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరు తనవంతుగా సహకరించారని తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సహకారం అందించారన్నారు. ఐదు సంవత్సరాల పాటు ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పని చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజినిరెడ్డి, వైస్ ఎంపీపీ లావణ్య రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, ఎంపీడీఓ రాములు నాయక్, ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏపీఓ శిరీష, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీఓ రద్దు చేయాలి

- అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి
- కొత్త జీఓ జారీ చేయాలని డిమాండ్
- ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీఓ నెంబర్ 10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.1 లక్ష పెంచుతూ కొత్త జీఓను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మంగళవారం అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి, జులై 24 తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.1 లక్ష చెల్లించాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సుమారు 10 వేల మంది పనిచేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు, రాష్ట్రంలో 24 రోజులు అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్‌కు పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అనంతరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ ఉద్యోగుల స్థితిగతులు, గత 24 రోజులు సమ్మె జరిగిన పరిస్థితి, ఆ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, హామీల్లో ఒకటైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ గురించి కూడా వివరంగా ప్రభుత్వం ఐసీడీఎస్ మంత్రి ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చామని గుర్తుచేశారు. అయినా ఒక్క అంశాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. పైగా రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మనోభావాలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను జులై 4 తర్వాత ఇంటికి పంపించాలని నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు తీవ్రమైన నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ నెం.10 ని జారీ చేసిందని అన్నారు. ఈ అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలించకుండా పక్కన పెట్టడం సమంజసం కాదన్నారు. పైగా అంగన్‌వాడీ ఉద్యోగులు వ్యతిరేకించిన పాత జీఓ అమలు చేయాలని చూడటం అన్యాయమన్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ డైరెక్టర్‌తో చర్చలు జరిగాయని ఈ చర్చలో అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ కోరుకుంటున్న విధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, అంగన్ వాడీ ఉద్యోగులకు సానుకూలంగా ప్రభుత్వానికి ఫైల్ పెడతామని ఐసీడీఎస్ డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారని అన్నారు. జూన్ 17న ఐసీడీఎస్ మంత్రి సీతక్కకు కూడా విన్నవించగా సానుకూలంగా స్పందించడంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెరుగుతాయని, వీఆర్ఎస్ సౌకర్యం వస్తుందని రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు.



పాత జీఓ రద్దు చేయాలి

ఇలాంటి సందర్భంలో మళ్లీ పాత జీఓ ప్రకారం అతి తక్కువ డబ్బులు చెల్లించి, జూలై 24 తర్వాత ఇంటికి పంపిస్తామని నిర్ణయం చేయడం అంటే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. వెంటనే పాత జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, జిల్లా అధ్యక్షురాలు డీ.వెంకటమ్మ, నాయకులు డీ.సునీత, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, నాయకులు యాటల సోమన్న, అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

- జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉండం గ్రామంలో రూ.2లక్షలు జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన లంద మైసమ్మ షెడ్, ఝరి గ్రామంలో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధుల నుంచి మంజూరైన సవారి బంగ్లా షెడ్‌కు మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సొసైటీ సీఈఓగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బొండ్ల భూమారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన కుమ్ర ఆనంద్ సతీమణి బిడ్డకు జన్మనిచ్చి మరణించడంతో బిడ్డ పాల కోసం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన సుంకరి నర్సయ్య ప్రమాదం జరగడంతో మెడికల్ ఖర్చులకు రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీటీసీ వెంట మండల కాంగ్రెస్ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, ఆ పార్టీ నాయకులు ప్రకాష్‌రావు, దివ్య మాధవ్, వెంకన్న, రాము, రఘు, రఫీక్, చల్ల దేవన్న, పోతన్న, రామచందర్, లస్మన్న, మహేందర్, మోహన్‌రెడ్డి, శ్రీను, రాము, రాజు, రఘునాథ్, అడెల్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులను సొంత బిడ్డల్లాగా చూడాలి

- వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వసతి గృహంలోని విద్యార్థులను అధికారులు తమ సొంత పిల్లల్లా చూసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శాంతినగర్‌లోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అంతకు ముందు వసతి గృహంలోని సౌకర్యాల వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, ప్లేట్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. వర్షకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హస్టల్ సంక్షేమాధికారి శివకుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల ప్రవీణ్, నాయకులు కేశవ్, రాజు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టును నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు. ముందుగా కడెం ప్రాజెక్టుకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించి, ముంపు ప్రాంతాల గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వరద గేట్ల మరమ్మత్తుల పనులను ప్రాజెక్టు సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రవీందర్‌తో కలిసి పరిశీలించి, ప్రాజెక్టు స్థితిగతుల పట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వర్షాకాలానికి ప్రాజెక్టు మొత్తం18 గేట్ల నుంచి 17 గేట్లు ప్రస్తుతం లిఫ్టు అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో ఒక్క గేట్ మరమ్మత్తుల పనులు వారం రోజుల్లో పూర్తి అవుతాయని ఆ గేట్ సైతం లిఫ్టు చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు కలెక్టర్ వివరించారు. ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడానికి ఏర్పాటు చేసిన అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన స్కాడా సిస్టంను పరిశీలించి, ప్రాజెక్టు గేట్లు ఎత్తడానికి ఈ నూతన టెక్నాలజీ బాగుందని పేర్కొన్నారు. అనంతరం విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం వచ్చే వరదలకు తట్టుకునేలా ప్రాజెక్టును సిద్ధం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, ప్రాజెక్టు ఈఈ విఠల్ రాథోడ్, డీఈ భోజదాస్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ అరుణ, జెఈ రవికుమార్, ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రమే విద్యార్థులకు పునాది



నవతెలంగాణ-నార్నూర్

అంగన్‌వాడీ కేంద్రమే విద్యార్థులకు ముఖ్య పునాదని సీడీపీఓ శారద, సూపర్‌వైజర్, మాస్టర్ ట్రైనర్ ఉమా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు మూడు రోజుల పాటుగా కొన్న సాగిన ప్రి స్కూల్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడారు. పూర్వ ప్రాథమిక విద్యా విధానంలో భాగంగా ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యా అందించేందుకు తగ్గిన శిక్షణ శిబిరాలను నిర్వహించామన్నారు. నార్నూర్ గాదిగూడ మండలంలో రెండు బ్యాచ్‌లు ఏర్పాటు చేసి, విద్యార్థులకు సులభ మైన విధానంలో డ్రాయింగ్, ఆట పాటలతో విద్యను అందించేందుకు అంగన్‌వాడీ టీచర్‌లకు మూడు రోజుల పాటుగా దశల వారీగా శిక్షణను అందించామని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లు ఆత్రం ఉమా, వందన, ప్రదిపిక,లక్ష్మీ ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ మోతీరాంకు బీజేవైఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు విడుదల చేయడం లేదని అన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం నిధులు నియామకాలు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గణేష్, శ్రీధర్, మురళి, సందీప్, వినోద్, సురేష్ ఉన్నారు.

రాథోడ్ రమేష్ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-కడెం

మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ చేసిన సేవలు మరువలేనివని అఖిలపక్ష నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అఖిలపక్ష నాయకులు, ప్రజలు సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా, ఆదిలాబాద్ ఎంపీగా ఆయన సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొరిపెల్లి దినకర్ రెడ్డి, వీడీసీ నాయకులు ఎస్‌కె హైమద్, ముంజ ప్రసాద్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు, మొలుగురి రాముగౌడ్, రత్నాల పోషన్న, నేరళ్ల రాజేశ్వర్, గ్రామ నాయకులు యెట్టం ఎర్రన్న, దుర్గం పోశన్న, ఫీలీ రాజేందర్, ఉత్కం రాజేశ్వర్‌గౌడ్, చాకలి గంగన్న, వెన్నం వెంకట రమణ, కుంటాల పెద్ద నర్సయ్య, నడ్పి నర్సయ్య, నిలీ అరవింద్, మూల శ్రీనివాస్, ఉత్కమ్ వెంకటేష్‌గౌడ్, బుర్ర గంగాగౌడ్, పోషగౌడ్, నరేష్‌గౌడ్, లింగాగౌడ్, రాజేశ్వర్, సాయి కుమార్‌గౌడ్, మూల రాజుగౌడ్, గొల్లపెల్లి రవి కుమార్, పంజాల నర్సయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

రూం టూ రీడ్ ఎంతగానో ఉపయోగం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేర్చుకున్న అక్షరాలు, గుణింతాలు, ఒత్తులతో పదాలు, వాక్యాలు ఎలా తయారు చేయవచ్చో డికోడబుల్ టెక్స్ ద్వారా ఒకటి, రెండు తరగతుల పిల్లలు సులభంగా నేర్చుకుంటారని అందుకు రూం టూ రీడ్ ఇండియా ట్రస్ట్ రూపొందించిన డికోడబుల్ టెక్స్ వికాసం1, 2లు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో డికోడబుల్ టెక్స్ వికాసం 1, 2లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రూం టూ రీడ్ ఇండియా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. రాష్ట్ర మేనేజర్ నరసింహా చారి మాట్లాడుతూ ప్రత్యేకంగా తమ సంస్థ తయారు చేసిన డికోడబుల్ టెక్స్‌ను ఉపయోగించడం వల్ల పిల్లలలో పఠనా నైపుణ్యాలు పెరిగడమే కాకుండా ధారాళంగా చదవుతారని, చదివినది అర్థం చేసుకోగలుగుతారని తెలిపారు. వారు స్వతంత్ర పాఠకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు. వీటిని త్వరలోనే అన్ని స్థానిక సంస్థల ప్రభుత్వ పాఠశాలలోని ఒకటి, రెండు తరగతి పిల్లలకు అందజేస్తామని తెలిపారు. వచ్చే నెలలో పద్దెనిమిది మండలాల్లోని పద్దెనిమిది ప్రాథమిక పాఠశాలలో రూం టూ రీడ్ సంస్థ రూపొందిస్తున్న మాడల్ లైబ్రరీల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ శ్రీకాంత్‌గౌడ్, రూం టు రీడ్ రాష్ట్ర ప్రతినిధి ఎస్.ప్రవీణ్, ప్రాజెక్టు అధికారి టి.నితిన్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రూ.50కే మామిడి మొక్కలు

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలోని నాలుగు ఉద్యాన నర్సరీల్లో నాణ్యమైన మామిడి మొక్కలు, అలంకరణ మొక్కలు అందుబాటులో ఉన్నయని, మార్కెట్ ధరలతో పోలిస్తే అతి తక్కువ ధరలకే మొక్కలు లభిస్తాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి మొక్క రూ.50, రూ. క్రోటాన్స్ అలంకరణ మొక్కలు, మునగ కరివేపాకు మొక్క రూ.20 లకే లభిస్తుందని అవసరమైన రైతులు, రైతు సంఘాలు, ఎన్‌జీఓలకు ఈ మొక్కలు విక్రయించినట్టు తెలిపారు. వివరాల కొరకు ఉద్యాన అధికారి సందీప్ కుమార్. 9032313933ను సంప్రదించాలని కోరారు.

గిరిజన లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా మహేందర్ జాదవ్

నవతెలంగాణ-నేరడిగొండ



గిరిజన లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా మహేందర్ జాదవ్ నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ నియమాక పత్రాన్ని అందజేసినట్లు జాదవ్ మహేందర్ సోమవారం తెలిపారు. మండలంలోని సవర్గాం గ్రామానికి చెందిన జాదవ్ మహేందర్ ఆరోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవీ కట్టబెట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు ఆదిలాబాద్ జిల్లా పరిధిలో లంబాడాల ఐక్యత కోసం తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్‌కి, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేష్ నాయక్‌కి ధన్యవాదాలు తెలిపారు.

ఆయిల్ బాల్స్ తయారీ పరిశీలన

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలం కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తయారుచేస్తున్న ఆయిల్ బాల్స్‌ను మంగళవారం పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్విని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండ ఈ ఆయిల్ బాల్స్‌ను ఉపయోగిస్తారని అన్నారు. వరి పొట్టు, గ్రీస్, ఆయిల్తో కలిపి వీటిని ఉండగా తయారు చేస్తారని వివరించారు. పంచాయతీ కార్యదర్శి వినయ్‌సాయి, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో అసంతృప్తిలో ప్రజలు

- హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై మాట్లాడారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం మినహాయించి, ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని అన్నారు. పక్క రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే అన్ని హామీలను అమలు చేస్తోందని, కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ పాలన పూర్తిగా గాడి తప్పిందని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనలను ఏమయ్యాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సైతం అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమయిందని ధ్వజమెత్తారు. పెన్షన్లు సకాలంలో అందక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందకపోవడంతో అన్నదాతలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఫోటో ఉందన్న కారణంతో పాఠ్యపుస్తకాల పంపిణీని నిలిపివేసి, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయంలో రాళ్ల భూములకు రైతుబంధు ఇచ్చామన్న ఆరోపణలను కొట్టిపడేశారు. అదే నిజమైతే క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలపైన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలకు మాత్రమే సీఎం పరిమితమయ్యారని అన్నారు. తమ ప్రభుత్వ హయంలో మిషన్ భగీరథ కింద శుద్ధజలన్ని నిరంతరం సరఫరా చేశామని, నిరంతర విద్యుత్ సరఫరా చేశామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు అజయ్, సాజిదోద్దిన్, యూనిస్ అక్బాని, కౌన్సిలర్ దమ్మపాల్, వంఢ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మెగా డీఎస్సీ వేయాలి

నవతెలంగాణ-బేల

మెగా డీఎస్సీని వేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు శివాజీచౌక్ నుంచి అంబేద్కర్‌చౌక్ వరకు ర్యాలీగా వచ్చి రోడ్డుపై బైఠాయించారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేష్, కుర్మ పవన్‌రెడ్డి, అభిషేక్, అనూజ్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని చిలాటిగూడలో పర్యటించిన ఆయనను పదవి కాలం ముగుస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ రామ్‌కిరణ్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



వర్ష కాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అర్షిన్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వర్షాకాలం దృష్ట్యా వచ్చే సీజనల్ వ్యాధులపై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు ఎంపీడీఓ అల్బర్ట్‌తో కలిసి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహనా కల్పించి, జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడడంతో పాటు పరిశుభ్రత గురించి వారికి తెలియజేయాలన్నారు. అలాగే ఇంట్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగాసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో చదివేందుకు విద్యార్థుల ఆసక్తి

- సీట్లకు పెరుగుతున్న డిమాండ్
- మౌళిక వసతులతో పాటు నాణ్యమైన విద్య
- ఫలితాల్లోనూ మెరుస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సిర్పూర్(టి)లోని కేజీబీవీ



పాఠశాల ఆవరణలో స్టడీ అవర్స్‌లో చదువుతున్న విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యా బోధనలోనూ, వసతులను కల్పించడంలోనూ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా కేజీబీవీ పాఠశాలలను నిర్వహిస్తుంది. కేజీబీవీ పాఠశాలలో మొదట కేవలం పదో తరగతి వరకు బోధన ప్రారంభించగా.. తదనంతరం ప్రభుత్వ నిర్ణయం మేరకు ఏడాదికి రెండు, మూడు స్కూళ్లను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ వస్తున్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను అమలుచేసేందుకు నిర్ణయించిన దృష్ట్యా ప్రభుత్వ స్కూళ్లతో పాటు కేజీబీవీల్లోనూ ఇంగ్లిష్ మీడియంను అమల్లోకి తీసుకువచ్చారు. కేజీబీవీ స్కూళ్లలో చదివేందుకు పేద విద్యార్థులందరూ ఆసక్తి చూపడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రతి ఏటా కొన్ని స్కూళ్లలో ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వం అనుమతులను మంజూరు చేస్తూ వస్తుంది. కేజీబీవీలకు ఉన్న డిమాండ్‌తో ప్రతి ఏటా నిర్దేశించిన విద్యార్థుల సంఖ్య కంటే అదనంగా విద్యార్థులు చేరుతున్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, భోజనం వసతి, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నందున ప్రభుత్వ నడిపే సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల, గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష ఆధీనంలో నడుస్తున్న కేజీబీవీ గురుకుల విద్యాలయంలో ప్రతి సంవత్సరం పిల్లల తల్లిదండ్రులు వీటిలో చేర్పించేందుకు మక్కువ చూపుతున్నారు. ప్రయివేటు పాఠశాలలు హాస్టల్స్ రూ.లక్షలు ఫీజులు కట్టి చదివించేది కంటే ప్రయివేటు పాఠశాలలో ఏ విధంగా అయితే వసుతున్నాయో అదేవిధంగా కేజీబీవీలో ఉన్నాయని భావించి ప్రవేశాలు చేయిస్తున్నారు. జిల్లాలో సమగ్ర శిక్ష ఆధీనంలో కేజీబీవీలు నడుస్తున్నాయి. సిర్పూర్-టిలో కేజీబీవీ 2011 సంవత్సరంలో 80 మంది విద్యార్థులతో ఆరు, ఏడు తరగతులతో ప్రారంభమైంది, 2021-22 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ రెండు గ్రూపులతో ప్రస్తుత విద్యా సంవత్సరం కొనసాగుతంది. పాఠశాల విభాగంలో 200 మంది విద్యార్థులు, కళాశాల విభాగంలో 160 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 97 శాతం, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100శాతం ఉత్తీర్ణ శాతం ఉండడంతో కేజీబీవీ విద్యాలయాలలో సీట్లకు డిమాండ్ పెరుగుతుంది.



సీట్లు పెంచాలని డిమాండ్

కేజీబీవీ విద్యాలయాలలో ప్రవేశాలు మొదట అనాధ పిల్లలకు, తల్లి లేదా తండ్రి లేని వారికి, ఆర్థికంగా స్తోమత లేని మధ్యలోనే చదువు ఆపివేసిన పిల్లలకు మండలంలోని మారుమూల గ్రామంలో పై చదువులు లేనటువంటి పిల్లలకు ప్రాధాన్యతన ఇస్తూ ప్రవేశాలు కల్పిస్తుంటారు. గతంలో కంటే నేడు అన్ని వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ఉచిత విద్య, భోజనం, వసతి కల్పించడంతో ప్రవేశాల కోసం బారులు తీరుతున్నారు. సీట్ల కొరత లేకుండా పెంచాలని తల్లిదండ్రుల నుంచి డిమాండ్ ఉండడంతో మరిన్ని సీట్లు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇంటి వాతావరణంలా ఉంది

నాగేశ్వరీ, తొమ్మిదో తరగతి



కేజీబీవీ పరిసరాలు ఇంటి వాతావరణం తలిపించేలా ఉన్నాయి. ఉపాధ్యాయులు, సిబ్బంది మంచిగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మా గురించి తెలుసుకుంటున్నారు. చదువుల్లో వెనకబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు ప్రోత్సహిస్తున్నారు.

అర్థమయ్యే బోధనలు

వైష్ణవి, పదవ తరగతి



కేజీబీవీలో ఉపాధ్యాయులు అర్థమయ్యేల బోధనలు చేస్తున్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు మంచి మార్కులు ఎలా సాధించాలి, ప్రణాళి బద్ధంగా చెబుతున్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయడంలో భాగంగా 15 రోజులకు ఓ సారి టెస్టులు నిర్వహిస్తున్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

నాగసుధ, స్పెషల్ ఆఫీసర్ కేజీబీవీ సిర్పూర్(టి)



మా పాఠశాలలో ఏ విధమైన కొరత లేకుండా వసతులున్నాయి. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను అందరికీ అందిస్తున్నాం. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. చదువుతో పాటు మంచి ఫలితాలు సాధించేల కృషి చేస్తున్నాం. దీంతో పాటు ఆరోగ్య పరంగా కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు విద్యార్థులకు సూచనలు చేస్తున్నాం.

ఐదేండ్లు ప్రజా సేవకే పని చేశాం



నవతెలంగాణ-వాంకిడి

పదేండ్ల కాలంలో ప్రజా సేవకే పని చేశామని ఎంపీపీ ఎంపీపీ విమలాబాయి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీల పదవికాలం ముగియడంతో ఎంపీపీ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి సత్కరించి వీడ్కోలు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుండి మండల అభివృద్ధి కోసం కలిసిమెలిసి పనిచేయడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అధికారులు, ఎంపీటీసీలు అందరి సహకారంతో మండల అభివృద్ధి కోసం కృషి చేయడం జరిగిందన్నారు. ముందు కూడా అందరు కలిసిమెలిసి మండల అభివృద్ధి కోసం ముందుండాలని, ఇకముందు కూడా మంచి పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రజల కోసమే పని చేయాలని కోరారు. మండలంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించడం జరిగిందని వివరించారు. గ్రామాల్లో కూడా అభివృద్ధి కోసం ఆయా వర్గాలు ముందుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఎంపీడీఓ వరలక్ష్మి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్, ఎంపీఓ, ఎంఈఓ, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు సంతోష్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గోపాల్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్- ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలన్నారు. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను వాయిదా వేసి నూతన తేదీలను ప్రకటించాలని కోరారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ కేటాయించాలని, పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీఓ 46ను వెంటనే రద్దు చేయాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పాగిడే కాంతారావు, పళ్ళెం పురుషోత్తం, డోకే బాపూజీ, తెలిగే రమేష్, పాగిడే దివాకర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-వాంకిడి

నీరు, నియమాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు నియామక విషయాల్లో నిరుద్యోగులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని బీజేవైఎం నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు మొండిచేయి చూపించిందని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో కొనసాగుతూ హామీలను నెరవేర్చడం లేదన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వీడి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ జిల్లాలోని నిరుద్యోగలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు ఎలుగటి సుచిత్, మండల అధ్యక్షుడు మండోకార్ వికాస్, నరేష్, పోశెట్టి, వేణు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తీరుకు వ్యతిరేకంగా రాస్తారోకో

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్‌కు చెందిన వినోద్ కుమార్, జైస్వాల్ కులం పేరుతో దూషించడంతో కేసు నమోదు అయింది. మంగళవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి వచ్చి పోలీస్ స్టేషన్ నుండి తీసుకపోవడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తీరును వ్యతిరేకిస్తు కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాలుగు లైన్ల రహదరిపై రాస్తారోకో చేపట్టారు. పోలీసులు సముదాయించే యత్నం చేసిన ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే విడిపించుకొని తీసుకెళ్లిన వారితో పాటు ఎమ్మెల్యేపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడి రమేష్ డిమాండ్ చేశారు.



ప్రజలకు పోషకాలు అందించడానికి చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్/రెబ్బెన



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

చిరుధాన్యాల (మిల్లెట్) యూనిట్ల ద్వారా అత్యధిక పోషక విలువలు కలిగిన ఆరోగ్యానికి దోహదపడే ఉత్పత్తులను ప్రజలకు అందజేయడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని రెబ్బెన మండలం దేవులవాడ గ్రామంలో సెర్ప్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మామ్స్ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి సందర్శించి యూనిట్‌లో తయారు చేస్తున్న చిరుధాన్యాల బిస్కెట్లు, స్నాక్స్, కేకులను పరిశీలించి యూనిట్ నిర్వహణపై నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామ్స్ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఆరోగ్యకరమైన చిరుధాన్యాల ఉత్పత్తులను అందించడం సంతోషంగా ఉందన్నారు. రూ. 63 లక్షల 25 వేల వ్యయంతో యూనిట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ యూనిట్ ద్వారా చిరుధాన్యాల ఉత్పత్తుల మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా నానో సంచులను ఉపయోగించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాల నడుమ విద్యార్థులకు విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, విద్యుదీకరణ, ఫ్యాన్లు, మూత్రశాలలు, అదనపు తరగతి గదులు ఇతర అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, పంచాయతీరాజ్ ఈఈ, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, యూనిట్ నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి రాయల్టీ డబ్బులు అందేలా చర్యలు

- జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ నీరజ్ కుమార్

నవతెలంగాణ-బెజ్జూరు

జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికి రాయల్టీ డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టేబ్రియల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో తునికాకు కూలీలతో మాట్లాడారు. పలు గ్రామాలకు చెందిన కొంతమంది కూలీలు రాయల్టీ డబ్బులు రావడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది కూలీల అకౌంటు తప్పుగా నమోదు కావడంతో డబ్బులు ఆలస్యమయ్యాయని, ఇప్పటికే పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించామని రాని వారి వివరాలు సేకరించి పూర్తిస్థాయిలో వచ్చేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మత్తడి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అడవుల అభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. అడవులను సంరక్షిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎలుకపల్లిలోని నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట రేల అధికారి దయాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్, సిబ్బంది ఉన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరించిన అధికారులు

నవతెలంగాణ-బెజ్జూర్



రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

మండల కేంద్రంలోనీ రైతు వేదికలో బుధవారం రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ డీసీఏఓ మహమూద్ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చేందుకు రైతుల అభిప్రాయం సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆరుగ్యారంటీ స్కీంలలో భాగంగా రైతులకు భరోసా ఇచ్చేందుకు అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. మండలంలో సేకరించిన అభిప్రాయ సేకరణలో ఎక్కువ శాతం మంది రైతు భరోసా పది ఎకరాల వరకు ఉన్న భూముల రైతులకు ఇవ్వాలని చెప్పారన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. రైతులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారన్నారు. ప్రభుత్వం నివేధిక అందిన తరువాత రైతులకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా దశాలవారీగా అభిప్రాయాల సేకరణ కొనసాగుతుందని చెప్పారు. పంటలు వేసిన రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తు మంచి దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, అసిస్టెంట్ రిజిస్టర్ అనంతలక్ష్మి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీవర్ధన్, తేలి బాపు, శ్రీహరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం, బెజ్జూర్ పీఏసీఎస్ సీఈఓ సంజీవ్, కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, నాయకులు జావిద్ అలీ, పుల్లూరీ సతీష్, నరేందర్ గౌడ్, హకీమ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్ధతి మార్చుకోకుంటే జైలుకే

- కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ
- జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎమ్మెల్యే కోవలక్ష్మి తన పద్ధతి మార్చుకోవాలని భాషా పదజాలాన్ని మార్చకపోతే జైలుకు పంపించాల్సి ఉంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను ఎమ్మెల్యే కోవలక్ష్మీ సోమవారం బూతులు తిట్టిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైనది కాదన్నారు. ఎమ్మెల్యే ఇలాంటి భాష మాట్లాడితే ప్రజల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి పదవిలో ఉన్న ఎమ్మెల్యే నియోజకవర్గానికి ఏమీ చేయలేదని ఆరోపించారు. గుండి బ్రిడ్జి, లక్మాపూర్ బ్రిడ్జితో పాటు తన సొంత గ్రామానికి కనీసం రహదారి కూడా వేయించలేదన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించుకున్న భవంతి ఎలా వచ్చిందో తెలియదా అని ప్రశ్నించారు. తీరు మార్చుకోకుంటే ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలుకు వెళ్లారని, త్వరలో కేసీఆర్ వెళ్తాడని అదే బాటలో ఎమ్మెల్యేను కూడా పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆదివాసీ మంత్రిని అవమాన పరిచేలా ఎమ్మెల్యే వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. గత పది సంవత్సరాల్లో ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌గా ఉండి అభివృద్ధి చేయలేదని ప్రస్తుతం అభివృద్ధి చేయడానికి ప్రయత్నం చేస్తున్న మంత్రిపై బురదజల్లే ప్రయత్నం చేయడం బాధాకరమని తెలిపారు. ఎమ్మెల్యే తన తీరు మార్చుకోవాలని హితవు పలికారు. విశ్వ ప్రసాద్, శ్యాం నాయక్ ఇలా మాతృమూర్తులను అవమానించేలా మాట్లాడడం మహిళా లోకానికి సిగ్గుచేటన్నారు. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు నాయకులు మాట్లాడుతూ ప్రోటోకాల్ తాము తప్పనిసరిగా పాటిస్తామని ఎవరో చెప్పారని ఎమ్మెల్యే ఇస్తానుసారం మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విశ్వనాథరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాది, జిల్లా మహిళా నాయకులు కోవా ఇంద్ర, వందన కుందారం, విజయ, శైలజ, వసంత్, గుండా శ్యామ్, కళావతి, తిర్యాణి మాజీ జడ్పీటీసీ జ్యోతి పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఫిర్యాదు

ఎమ్మెల్యే కోవ లక్ష్మీపై ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీసీసీని అగౌరవపరిచిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అలీ, ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు జామీర్ అహ్మద్, తిర్యాణి మండల అధ్యక్షుడు నితిన్, టేకం గంగారం, కిరణ్, ఆదిల్ పాల్గొన్నారు.

ఎల్కపల్లి వారసంత వేలంపాట

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్కపల్లి వారసంత వేలంపాటను మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వారసంత వేలం ప్రక్రియ కొనసాగింది. ఇందులో ఔత్సహికులు పాల్గొనగా జాడి మల్లేష్ రూ.1,12,700కు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. తొమ్మిది నెలల వరకు ఆయన వేలం దక్కించుకున్నారని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | జులై 03, 2024 | www.navatelangana.com

రేపు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్

నవతెలంగాణ-కాసిపేట



ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్ కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్టు స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అదే విధంగా పాఠశాలల మూసివేతను ఆపాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులపై అక్రమ కేసులు నిర్బంధాలు ఆపాలని ఎస్ఎఫ్ఐ సెంట్రల్ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణలో ఐక్య విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు నివ్వడం జరిగిందన్నారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని అన్ని గ్రామాల్లో వనమహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఎంపీడీఓ శశికళ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల శివారుల్లో మొక్కలు నాటేందుకు సిద్ధం చేసిన గుంతలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా మొక్కలు నాటనున్నట్లు ఆమె పేర్కొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేల చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు సూచించమని తెలిపారు. ఆమెతో పాటు ఎంపీఓ రమేశ్, ఈజీఎస్ ఏపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శులున్నారు.

వర్షాకాల జాగ్రత్తలపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్కే-6 గనిలో ఏరియా హెల్త్ ఆఫీసర్ లోకనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ జాగ్రత్తలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీరు తగినంత తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని ఎక్కువగా తాగలన్నారు. ఇంటి లోపల బయట పరిసర ప్రాంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గని మేనేజర్ తిరుపతి, ఎస్ఓఎం మాట్లాడుతూ వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని, మద్యపానం, ధూమపానం మాంసాహారం అతిగా తీసుకోకుండా కూరగాయలకు, పండ్లకు ప్రాముఖ్యతనిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, డిప్యూటి మేనేజర్ మర్రి కోమురయ్య, ఫిట్ ఇంజనీర్ అండె శ్యాం కుమార్, ఇంజనీర్ ఆర్.మహేష్, డిప్యూటి పర్సనల్ మేనేజర్ కే.సునిల్ కుమార్, ఎంజీటీఎం శరత్, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ సదానందం, సాయి బాబా, గోరె నర్సయ్య, బి.లక్ష్మయ్య, చంద్ర మౌళి, అడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా 11కేవీ కరెంట్ స్తంభం

- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపలాపూర్ గ్రామ శివారులోని పొలాల నుండి రాంపూర్ గ్రామానికి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇనుప స్తంభానికి చిలుము పట్టి పడిపోయేలా ఉంది. స్తంభాన్ని మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణాలు వినిపించాయి. రానున్న వర్షాలకు విద్యుత్ స్తంభం కింద పడితే పెను ప్రమాదం జరుగుతుందని రైతులు బయపడుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే ఇనుప విద్యుత్ స్తంభాన్ని మార్చాలని రైతుల కోరుతున్నారు.

కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని కాలనీలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి సివిల్ విభాగం అధికారులకు సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హల్‌లో ఏరియా సివిల్ విభాగ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న కాలనీలలో సివిల్ ఉద్యోగులు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి చెత్తా చెదారం కాలనీలలో ఉంచకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, శుద్ధమైన మంచినీటిని కాలనీలకు పంపిణీ చేయాలని సూచించారు. వర్షాకాలంలో కాలనీలలో వర్షపు నీరు నిలవకుండా చూడాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో సివిల్ విభాగ అధికారులు ఉద్యోగులు నిరంతరం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎస్ఓ టూ జీఎం గోపాల్ సింగ్, డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, ఇన్‌చార్జీ సివిల్ డీజీఎం రాము, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, గట్టయ్య, డాక్టర్ లోకనాథ్ రెడ్డి, సివిల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాన్ కార్డుతో ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలి

శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులకు ఇన్కమ్ టాక్స్ డిపార్మెంట్ నిబంధనల అనుసారం ప్రతి ఉద్యోగి తమ పాన్ కార్డుతో ఆధార్ కార్డును అనుసందానం చేసుకోవాలని ఏరియా జీఎం సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 700 మంది ఉద్యోగులు తమ పాన్ కార్డుతో ఆధార్ కార్డును అనుసందానం చేసుకోలేదని తెలిపారు. అనుసందానం చేసుకోకపోతే ఆదాయ పన్ను శాఖ వేసే జరిమానాకు బాధ్యులు కావాల్సి ఉంటుందన్నారు. జీతం నుండి 20శాతం జరిమానాగా అనుసందానం చేసుకునేంత వరకు ఇన్కమ్ టాక్స్ వసూలు చేస్తారన్నారు.

సంపూర్ణత అభియన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

సంపూర్ణత అభియాన్ ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జవహర్ లాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీతి ఆయోగ్‌లో భాగంగా ప్రారంభ కార్యక్రమాన్ని 4న గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు భీంపూర్ మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం సర్వసభ సమావేశం బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, మండల వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్



కోటపల్లిలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

సమస్త జీవరాశికి ప్రాణవాయువు అందించే మొక్కల పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కోటపల్లి మండల కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాదాయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడటంలో వృక్షాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో మన వంతు బాధ్యతగా మొక్కలు నాటించడంతో పాటు వాటిని సంరక్షించాలని కోరారు. ప్రయివేటు, కార్పోరేట్ విద్యా సంస్థలకు ధీటుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందింస్తున్నామని తెలిపారు. 6 నుండి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏక రూప దుస్తులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఉపకరా వేతనాలు అందించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన, విద్యార్థులకు ఆరోగ్య పరిక్షలకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠ్యంశాల బోధన చేయడం జరుగుతుందన్నారు. అనుభవజ్ఞులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తున్నామని పేర్కొన్నారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించి విద్యను అందించేందుకు సంబందిత అధికారులు, ఉపాధ్యాయుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి భూమయ్య, ఎంపీపీ , ఉపాధి హమీ పథకం సెర్ప్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5న ధర్నాను విజయవంతం చేయండి



నవతెలంగాణ-నస్పూర్

బొగ్గు బ్లాక్లు వేలం వేయడాన్ని నిరసిస్తూ ఈనెల 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం సరికాదన్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు బీఆర్ఎస్ ఎంపీలు సంతకాలు చేశారని, ఆ చట్టం ప్రకారమే సింగరేణిలో బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తున్నారని తెలిపారు. తెలంగాణ బిడ్డ కిషన్ రెడ్డి బొగ్గు గనుల శాఖకు మంత్రిగా ఉన్నందున సింగరేణిలో బొగ్గు బ్లాక్‌లో వేలం వేయకుండా సింగరేణికి కేటాయించేలా చేయాలని డిమాండ్ చేశారు. గత వేలంలో పట్టించుకున్న రెండు బ్లాకులు కోయగూడెం ఓసీ త్రీ, సత్తుపల్లి ఓసీ ప్రయివేట్ కంపెనీలు ఇంకా పనులు ప్రారంభించినందున వాటిని రద్దుచేసి, నాలుగు బ్లాగులను సింగరేణికి కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. జులై 8 నుండి 12 వరకు జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. నిరసన కార్యక్రమాల్లో కలిసివచ్చే యూనియన్లు, పార్టీలతో కలిసి బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలని కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం అమానుషమన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్లను సింగరేణికి కేటాయించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏరియా ఉపాధ్యక్షుడు మోత్కూరి కొమురయ్య, సీపీఐ నాయకులు జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలతో బొగ్గు ఉత్పత్తి, రవాణా కొనసాగాలి

- వర్షాకాలంలో ఉత్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకోవాలి
- సింగరేణి వ్యాప్త జీఎంతో సింగరేణి సీఎండీ బలరామ్



అధికారులతో సమావేశమైనన సీఎండీ బలరామ్

నవతెలంగాణ-జైపూర్

ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడం కోసం నిర్దేషిత లక్ష్యాలతో బొగ్గు ఉత్పత్తి, రవాణా కొనసాగాలని సింగరేణి సీఎండీ బలరామ్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేషించిన 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలని అన్నారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులు, ఆడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు ఇతర కంటిన్యూయస్ మైనర్ల పని తీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. ఈ క్రమంలో ప్రతి రోజు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో ఉత్పత్తికి నష్టం కలుగకుండా హాల్ రోడ్లను ఎప్పటికప్పుడు పటిష్టపర్చుకోవాలని, క్వారీల్లో నిలిచిన వర్షం నీటిని పంపింగ్ చేయాలని, ఏదైనా షిఫ్ట్‌లో వర్షం వల్ల ఉత్పత్తికి నష్టం కలిగితే మరుసటి షిఫ్టులో నష్టాన్ని భర్తీ చేయాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏరియాలకు అవసరమైన యంత్రాలను, ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఏజెన్సీల నియామకం వంటివి పూర్తి చేశామని తెలిపారు. ఉద్యోగులందరు తమకు కెటాయించిన 8 గంటల పూర్తి సమయంలో పని చేసే విధంగా వారిని చైతన్య పరచాలని అధికారులు శ్రద్ధ చూపించాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ రావు, పర్సనల్ ఎస్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం కోఆర్డినేషన్ దేవేందర్, జీఎం సీపీపీ రవి కుమార్, కార్పోరేట్ ఏరియా జీఎంలు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంటల సాగుకు అటవీ అధికారులు అడ్డుపడటం ఏమిటి..?

నవతెలంగాణ-జైపూర్



అటవీ అధికారుల దౌర్జన్యం మితిమీరి పోతుందని చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామ శివారు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బాధిత రైతులు అటవీ అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం పంట పొలాల వద్ద ధర్నా చేశారు. కొంత కాలంగా పంటలు సాగు చేసుకుంటున్న భూములు అటవీ భూములు అంటూ అడ్డుపటం విడ్డూరమని తెలిపారు. 2010 సంవత్సరానికి ముందు ప్రభుత్వ పరంగా పట్టా హక్కులు పొంది పంటలు సాగు చేస్తున్న భూములు అటవీ భూములు అనడం బాధాకరమని పేర్కొన్నారు. సర్వే నెం. 582, 729, 730, 732లలో గల సుమారు 160 ఎకరాల భూమిలో దాదాపుగా 120 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. పంటలు సాగు చేస్తున్న రైతుల అందరు పట్టాదార్ పాసుపుస్తకాలు కలిగి ఉంటడంతో పాటు పొజీషన్ కలిగివున్నామని తెలిపారు. పంటలు సాగు చేస్తున్న క్రమంలో అడ్డుపడిన అటవీ అధికారులు అటవీ భూములు అంటూ నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. 1954, 1961, 1964, 1971 సంవత్సరాల్లో ఈ భూములకు పట్టాలు పంపిణీ చేశారని, ఈ భూముల్లో పంటలు సాగు చేస్తూ ప్రభుత్వం నుండి రైతు బంధు పొందుతున్నామన్నారు. ఉన్నట్టుండి పంట పొలాల్లోకి పోవద్దని హెచ్చరిస్తున్నారన్నారు. పంటల సాగుకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ కార్యాలయాన్ని సంప్రదించిన స్పందించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

డీఏవీ స్కూల్‌లో సీట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం

- ఎంఐఎం మండల అధ్యక్షులు ఎండీ అలీ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిల్లీకి సంబంధించిన డీఏవీ స్కూల్‌లో స్థానిక ముస్లీంలకు అడ్మిషన్ సీట్లు ఇవ్వడం లేదని, కావాలనే సీట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఎంఐఎం మండల అధ్యక్షులు ఎండీ అలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవాపూర్‌లోని డీఏవీ పాఠశాలను ఓరియంట్ కంపెనీ యాజమాన్యం డిల్లీ నుంచి తీసుకువచ్చి ఇక్కడ పెట్టిందని, స్థానికులకు మాత్రం సీట్లు ఇవ్వడం లేదదని, ముస్లీం పిల్లలకు అసలు సీట్లు ఇవ్వకుండా కావాలనే ఈ విధానాన్ని అవలంభిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాకుండా డిల్లీ నుంచి ఆదేశాలని ఇక్కడి విధానాలు అవసరం లేకుండా పాఠశాల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఐఎం టౌన్ అధ్యక్షుడు ఎస్కే జహీర్, సలహదారులు ఖైరత్ హుస్సేన్, షేక్ సాబీర్, షేక్ రఫీక్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



నవతెలంగాణ-వేమనపల్లి

మొక్కలతోనే మానవ మనుగడ ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ అన్నారు. మంగళశారం మండలంలోని నీల్వాయి గ్రామ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా చెట్లు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామపంచాయతీలలో వారం రోజులలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ఇంటికి 6 పండ్ల మొక్కల కింద 31,170 అదే విధంగా ఇతర ప్రదేశాల్లో 58,430 చొప్పున మొత్తం 89,600 మొక్కలు నాటాలనే లక్ష్యం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీఓ అనిల్ కుమార్, సీడీసీఎల్ఆర్సీ సురేష్, ఏపీఓ సత్య ప్రసాద్, ఇసి మధుకర్, సాంకేతిక సహాయకులు కృష్ణ మోహన్, లక్ష్మన్, పంచాయతీ కార్యదర్శి అశోక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షాబీర్ అలీ, మాజీ సర్పంచులు గాలి మధు, తిరుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలలో ప్రవేశానికి ఈ నెల 28న నిర్వహించే జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో జిల్లా నుండి 11 మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజీవ్‌రు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో బాలురు బండారి రక్షిత్ (చెన్నూర్), కండే మిశ్రనత (రామకృష్ణాపూర్), చిట్టి అయన్ (మందమర్రి), దాసరి సుశాంత్ (మందమర్రి), కొండర శివ (నస్పూర్), దండెటి అయాన్స్ (రామకృష్ణాపూర్), చొప్పదండి అయనశ్వర్య, బాలికలు గోయాస హన్వి (తాండూర్), కొండ అద్వ (బెల్లంపల్లి), అరంమ్ శ్రీనిత్య(రామకృష్ణాపూర్), అంగల శ్రీకృతి (మందమర్రి) ఎంపియ్యారని తెలిపారు. ఎంపికైన వారు జనన, కులం, బోనఫైడ్ ధృవపత్రాలు, ఆధార్‌కార్డు, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు 2 సెట్ల నకలు ప్రతులు, 5 ఫొటోలతో అభ్యర్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 7న మధ్యాహ్నం 2 గం.లకు హకీంపేట క్రీడా పాఠశాలలో రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలు 9963539234 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నిర్ణీత గడువులో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో వనమహోత్సవ కార్యక్రమం ద్వారా మండలానికి సంబంధించిన లక్ష్యాన్ని నిర్ణీత గడవులో పూర్తి చేస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుర్రం సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 7లోపు మండల పరిధిలో ఒక కోటి 20 లక్షలు మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీల పరిధి నివాస గృహ సమూదాయాల్లో 58 లక్షలు మొక్కలు నాటించడం జరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, సంపత్ రెడ్డి, అంబల్ల రవి, కల్కి రమేష్, అరిగెల శ్రీనివాస్, అనిల్, చీనూరి మధు, లింగయ్య పాల్గొన్నారు.

ఆంక్షల ఎత్తివేత కోసం పాదయాత్ర



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ అభయారణ్యంలో ఆంక్షలు ఎత్తివేయాలని, ప్రజల బాధను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని జన్నారం మండలానికి చెందిన సామాజికవేత్త భూమా చారి ఆవేదన వ్యక్తం చేశారు. కవ్వాల్ అభయారణ్య భారీ వాహనాలపై పెట్టిన ఆంక్షలు ఎత్తివేత కోసం మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. కవ్వాల్ అభయారణ్య ఆంక్షలతో యువతకు ఉపాధి దొరకడం లేదని అన్నారు. ఆంక్షలు ఎత్తివేసేందుకు చేపట్టిన తమ ఉద్యమానికి ప్రజలు కలిసి రావాలని కోరారు. ఐక్యంగా పోరాడితేనే టైగర్ జోన్‌లో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావచ్చని తెలిపారు. పాదయాత్రలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి మహేష్ పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జులై 03, 2024 | www.navatelangana.com

పాఠశాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ 2ను మంగళవారం డీఈఓ ప్రణీత సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల యూనిఫామ్ గురించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ఫీజు వివరాలను ఉపాధ్యాయుల విద్యార్హతల గురించి తెలుసుకొని వారికి తగిన సూచనలు ఇచ్చారు. డీఈఓ వెంట సిబ్బంది ఉన్నారు.

దూషించిన వారిపై కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన



ఆదివాసీ మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా దూషించిన కాంగ్రెస్ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ డిమాండ్ చేశారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సీఐ చిట్టిబాబుకు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి సీతక్క కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళా అని చూడకుండా ఎమ్మెల్యే అని చూడకుండా అవమానపరిచారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

3నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వచ్చే 3నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, భారీ వర్షాలకు వరదలు రాకుండా ముందస్తు చర్యలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి, తగు చర్యల నిమిత్తం ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్‌డబ్ల్యూఎస్, డీపీఓ, పోలీస్ శాఖ అధికారులు, తదితర శాఖల అధికారులతో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో పలు ప్రాంతాలలో జరిగిన సంఘటనలకు తావివ్వకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని, ఎక్కడెక్కడ రోడ్లు దెబ్బతిన్నాయో, శిథిలావస్థకు ఇండ్లు, గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని, హాస్టల్స్‌లో పరిశుభ్రత పాటించడం, 312 హాబిటేషన్‌లో వర్షాకాలం ఇబ్బందులు ఎదురవుతున్న వాటిని గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలలో ముందుగానే 3నెలలకు సరిపడ సరుకులు, పౌష్టికాహారం, తదితర సరఫరా చేసుకోవాలని అన్నారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొత్తం 457 చెరువులు ఉన్నాయని తెలిపారు. డెంజర్ జోన్‌లకు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్‌లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు పోల్స్ రెడీగా ఉన్నాయని అన్నారు. వరదలు, విద్యుత్ ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, భారీ వర్షాల సమయంలో సురక్షితంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రహదారుల పై ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి విపత్తుల నివారణకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

క్లినిక్‌లకు షోకాజ్ నోటీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేటు ఆస్పత్రుల నిర్వాహణ లోపాలను పరిశీలించుటకు వైద్యారోగ్య శాఖాధికారులు తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం పట్టణంలోని శివాజీచౌక్‌లోని ఆర్‌ఎంపీ డాక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రెండు క్లినిక్‌లను జిల్లా వైద్యారోగ్య శాఖ బృందం తనిఖీలు నిర్వహించారు. స్థాయికి మించి ఫస్ట్ ఎయిడ్ కేంద్రంలో అందించే సేవల కంటే రోగులను ప్రభావితం చేసే అంశాలను గుర్తించి, రెండు క్లినిక్‌లకు షోకాజ్ నోటీసులు అందజేశారు. అలాగే ఒక్కో క్లినిక్‌కు రూ.5వేల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో వెంకట్‌రెడ్డి, రాంప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

రేపు విద్యాసంస్థలు బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం నీట్ అభ్యర్థులకు న్యాయం చేయకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. నీట్ అభ్యర్థులకు నాయ్యం చేయాలని ఈనెల 4న దేశవ్యాప్తంగా జాతీయ విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగానే విద్యా సంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని, ఎన్టీఏ సంస్థ చైర్మెన్‌ను భర్తరఫ్ చేసి నీట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ నూతన విద్యా విధానం ఎన్‌ఈపీ 2020ను రద్దు చేయాలన్నారు. నీట్ అభ్యర్థులకు న్యాయం చేసి, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే 4న విద్యాసంస్థలు బంద్‌కు పిలుపునిచ్చామని తెలిపారు. ఈ బంద్‌కు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రయివేట్ విద్యా సంస్థల యజమాన్యాలు, అభ్యుదయవాదులు, మేధావులు, విద్యావేత్తలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ కోట్నాక్ సక్కు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు తబ్రేజ్ ఖాన్, టీవీవీఎస్ జిల్లా నాయకులు ఉయిక విష్ణు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు, ఎర్రజి హరీశ్, పీవైఎల్ జిల్లా నాయకులు. మెస్రం మారుతి పాల్గొన్నారు.

సంఘం అభ్యున్నతికి కార్యవర్గం పని చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాయి బ్రహ్మణ సంఘంతో పాటు సభ్యుల అభ్యున్నతికి కార్యవర్గం పని చేయాలని నాయిబ్రహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు అంజయ్ కుమార్ అన్నారు. గత సంవత్సరం పట్టణ సంఘం ఎన్నికలు జరగ్గా సంవత్సర కాలానికి రాములును ఎన్నుకున్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి ఉన్న సంఘానికి రెండవ అధ్యక్షుడిగా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. రెండు సంవత్సరాల పాటు పట్టణ అధ్యక్షుడిగా వెంకటేష్ కొనసాగనున్నారు. మంగళవారం బీసీ సంఘ భవనంలో నూతనంగా ఎన్నికైన వెంకటేష్‌తో పాటు మాజీ అధ్యక్షున్ని సత్కరించారు. ఈ సందర్భంగా నాయిబ్రహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు అంజయ్ కుమార్ మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో సంవత్సర కాలం పాటు అధ్యక్షుడిగా రాములును ఎన్నుకోవడం జరిగిందని, ఆయన కాలపరిమితి పూర్తి కావడంతో నూతన అధ్యక్షుడి ఎన్నిక జరిగిందని తెలిపారు. రానున్న రెండు సంవత్సరాల కాలం పాటు వెంకటేష్ కొనసాగనున్నారని తెలిపారు. సంఘ సభ్యులతో పాటు సంఘ బలోపేతం కోసం నూతన అధ్యక్షుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, నాయిబ్రహ్మణ అధ్యక్షుడు వేణుగోపాల్, రాము, మందపల్లి శ్రీనివాస్, నర్సన్న, శ్రీకాంత్, రాజు, సచిన్ పాల్గొన్నారు.

నాలుగు రోజుల పాటు రైల్వేగేటు మూసివేత

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తక్కలపల్లి రైల్వే గేటు నాలుగు రోజుల పాటు మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడవ లైన్ పనుల నిమిత్తం నాలుగు రోజుల పాటు రైల్వే గేట్ మూసి వేయబడుతుందని తెలిపారు. ఈనెల నాలుగు నుంచి 7వ తేది వరకు మరమత్తులు కొనసాగుతాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పదవీ కాలం పూర్తి...పారితోషికం అసంపూర్తి

- ప్రజాప్రతినిధులకు ఏడు నెలల పెండింగ్‌లో గౌరవ వేతనం
- నిధులివ్వాలని డిమాండ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్య పరిపాలనలో స్థానిక సంస్థల పాత్ర వెలకట్టలేనిది. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని చట్టసభల వరకు తీసుకువెళ్లడానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మధ్యవర్తిత్వం వహిస్తారు. అటువంటి స్థానిక ప్రజాప్రతినిధుల పాలన కాలం నేటితో పూర్తికావస్తున్నప్పటికీ వారికి రావాల్సిన పెండింగ్ పారితోషకం ఇతర నిధులపై ఎటువంటి క్లారిటీ లేకపోవడంతో ఎవరితో చెప్పుకోవడం తెలియని పరిస్థితి ఉంది.

పదవి కాలం పూర్తి...పారితోషికం అసంపూర్తి

జిల్లాలో స్థానిక సంస్థల పరిధిలో 15 మండలాల్లో 129 మంది ఎంపీటీసీలు 15 మంది జడ్పీటీసీలున్నారు. వీరికి ఎంపీటీసీలకు రూ.6500 గౌరవ వేతనం, జడ్పీటీసీలకు రూ.తొమ్మిది వేలు గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లిస్తోంది. వీరితో పాటు జడ్పీ చైర్మన్‌కు రూ. లక్ష నెలకు చెల్లిస్తోంది. అయితే నేటితో వీరి పదవి కాలం ముగుస్తున్నప్పటికీ గౌరవ వేతనానికి సంబంధించి పెండింగ్ బకాయిలపై ఎటువంటి నిర్ణయం వెలువడ లేదు. పదవీకాలం పూర్తయిన పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల జరిగిన జడ్పీ ప్రత్యేక సమావేశంలో సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే(ఫైల్)

ఏడు నెలలుగా పారితోషికాలు పెండింగ్

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ప్రభుత్వం చెల్లించే పారితోషికలు గత జనవరి నుండి పెండింగ్ లో ఉన్నాయి. ప్రజల సమస్యలు తీర్చే తాము ప్రభుత్వాన్ని పారితోషికాల గురించి ఎలా ప్రశ్నించాలని మీమాంసలో ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఏడు నెలల పెండింగ్ గౌరవ వేతనాలతో పదవీకాలం పూర్తి చేసుకోవాల్సి వస్తుంది.

పెండింగ్ నిధులు పారితోషకానికి డిమాండ్

పారితోషికలతో పాటు కొన్నిచోట్ల స్థానిక ప్రజా ప్రతినిధులు చేసిన పనులకు సంబంధించి బిల్లులు కూడా పెండింగ్ ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం పూర్తయి గతంలో వారు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కొన్నిచోట్ల ఇంకా రాలేదు. ప్రస్తుతం ఎంపీటీసీ, జడ్పీటీసీల పరిస్థితి కూడా అలాగే తయారయ్యేటట్లు ఉందని వాపోతున్నారు. పెండింగ్ నిధులు, పారితోషకాలు విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్ ప్రజాప్రతినిధుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

పెండింగ్ మొత్తాలను ప్రభుత్వం చెల్లించాలి

నాగేశ్వరరావు, జడ్పీటీసీ



ప్రభుత్వం ఏడు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను చెల్లించాలి. ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి కావడం కొంత బాధగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను కొన్నింటిని నెరవేర్చడం తృప్తి కలిగించింది. పదవి కాలం పూర్తయినప్పటికీ ప్రజలతో ఉంటూ పనిచేస్తాం. పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ, రవాణాపై తీసుకోవాల్సిన నిర్ణయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, విద్యార్థులలో మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహనను కల్పించాలన్నారు. ప్రతి యాంటీ డ్రగ్ కమిటీలలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు ర్యాలీలు, వ్యాసరచన, డాన్స్ పోటీలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల హాస్టళ్లపై శ్రద్ధ వహిస్తూ, తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 111 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని 67 మందిపై కేసులతో పాటు 42 మంది గంజాయి విక్రయదారులపై బైండోవర్ కేసులను నమోదు చేశామన్నారు. గంజాయి మత్తు పదార్థాలపై ఎటువంటి సమాచారం ఉన్న పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామాలను గంజాయి విక్రయదారుల ఆశలో పడి రైతులు పండిస్తే ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ది చేకూరదని, కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా మహారాష్ట్రతో సరిహద్దులో ఉన్నందున రైలు, రోడ్డు మార్గాలలో గంజాయి విక్రయదారులు ప్రయాణిస్తున్నట్లు, చిన్న మొత్తంలో ఆదిలాబాద్ పట్టణంలోకి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు, వారిని అడ్డుకునేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తూ అడ్డుకుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు చైతన్య పర్చాలన్నారు. అత్యధికంగా గంజాయి వినియోగిస్తున్న వారికి డి.అడిక్షన్ సెంటర్లకు సిఫారసు చేసి వైద్యం అందించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 124 కేజీల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాల్చడం జరిగిందన్నారు. ఇందులో డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆర్డీఓ వినోద్ కుమార్, స్త్రీ శిశు, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు సవిత, సునీత కుమారి, డీఈఓ ప్రణిత, డీఐఈఓ రవీందర్, ఎక్సైజ్ సూరింటెండెంట్ హిమశ్రీ, వ్యవసాయాధికారి రమేష్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో వెయ్యి మొక్కలు నాటడమే లక్ష్యం

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- రిమ్స్‌లో వనమహోత్సవం
- మొక్కలు నాటిన వైద్యులు, మెడికోలు





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో వెయ్యి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ పాల్గొని మొక్కలు నాటి నీరు పోసి ప్రారంభించారు. మెడికోలతో పాటు వైద్యులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ఆయా విభాగాల హెచ్ఓడీలకు బాధ్యతలను అప్పగించామని తెలిపారు. 21 విభాగాలు, వైద్యులను కలిపి ఒక్కొక్కరికి 50 మొక్కల చొప్పున లక్ష్యం ఇచ్చామన్నారు. నాటిన మొక్కకు ట్రీ గార్డుతో పాటు వారి పేర్లను సొంత ఖర్చులతో పెట్టుకోవాలని, దీన్ని పర్యవేక్షించడానికి డాక్టర్ సుమలతను నియమించడం జరిగిందని తెలిపారు. రిమ్స్ లో పచ్చదనం పెంచడం కారణంగా ఇటీవల గ్రీన్ చాంప్ అవార్డు కూడా వచ్చిందని గుర్తుచేశారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, ఇద్రిస్ అక్బాని, కళాశాల డీన్ డా.వంజరి, వైస్ ప్రిన్సిపాల్స్ డా.సరోజ, డా. విద్యావిల్సన్, వైద్యులు డా.సుమలత, శ్యామ్, తిప్పేస్వామి, చంద్రశేఖర్, సందీప్ పవార్, సింధూజ, అశ్విన్ రాథోడ్, మెడికోలు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇటీవల బదిలీలలో భాగంగా నూతన పాఠశాలలకు కేటాయించబడిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రిఫరెన్సీ ఆఫ్ కేటగిరిలో బదిలీ అయిన ఉపాధ్యాయులు కూడా రిలీవర్ కోసం వేచి చూడకుండా రిలీవ్ చేయాలని, పాఠశాలలలో ఏర్పడ్డ ఖాళీలను డీఎస్సీ నియామకాల వరకు తాత్కాలిక ప్రతిపాదికన విద్యా వాలంటీర్లను నియమించాలని కోరారు. అతి తక్కువ కాలంలో ఐదు, ఆరు వందల ఆప్షన్స్ పెట్టుకోవడం, సర్వర్, నెట్వర్క్ ఇబ్బందుల వలన కొన్ని మారుమూల ప్రాంతంలో ఉండే పాఠశాలలు ఆప్షన్ జాబితాలో సెలెక్ట్ కావడం వలన విధులు నిర్వహించలేనటువంటి కొండ ప్రాంతాలలో మహిళ ఉపాధ్యాయులకు నూతన పాఠశాలలు కేటాయించడం జరిగిందన్నారు. వారు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరిని కూడా కేటాయించకపోవడం వల్ల మానవతా దృక్పాదంతో తిరిగి అదే పాఠశాలలో కొనసాగేలా లేదా మిగిలి ఉన్న ఖాళీలలో పాఠశాలలను కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాదవ్ సుభాష్, మండల నాయకులు సుల్వ ప్రశాంత్, శివానంద్, విజయరాణి, లావణ్య, వేణి పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా కమిటీ డిమాండ్

బదిలీ పొందిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రకాష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఆరు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న బదిలీలు ప్రక్రియ పూర్తి చేశారని, ఈ బదిలీల సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు లేరని రేషనైలేజేషన్ పేరుతో జిల్లాలో 104 పోస్టులను బదిలీలందు తొలగించారని, ఫలితంగా ఉపాధ్యాయులు చాలా దూరప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మరల సబ్సిట్యూట్ పేరుతో జిల్లాలో 90 శాతం మంది ఉపాధ్యాయులు బదిలీ పొందిన కూడా రిలీవ్ కాకుండా అదే పాఠశాల కొనసాగే పరిస్థితి ఉందని, దీని నివారించేలా బదిలైన ఉపాధ్యాయులందరినీ వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.



మెరుగైన వైద్య సేవలందించాలి

నవతెలంగాణ-నిర్మల్



ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, ఆస్పత్రిలోని అత్యవసర సేవల విభాగం, ల్యాబ్, డయాలసిస్ కేంద్రం, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలు, వయోవృద్ధుల ఫిజియోథెరపీ, ఆరోగ్యశ్రీ, జనరల్ వార్డులను పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సలకు సంబంధించి వివరాలను వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వాస్పత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, భాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆరోగ్య మిత్ర సేవలు ప్రతి ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలను అన్నారు. వివిధ విభాగాలకు సంబంధించి సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని, ఆస్పత్రిలో అందిస్తున్న సేవలకు సంబంధించి సమాచారాన్ని డిజిటల్ డిస్‌ప్లే చేయాలనీ ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. చికిత్సకోసం వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఫిజియోథెరపీ, క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణాలను పరిశీలించి వైద్యాధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి పర్యవేక్షకులు డా. రవీందర్, వైద్యులు ప్రసాద్, శ్రీనివాస్, దరహాస, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే గుర్తింపు నిస్తుంది : ఎంపీడీఓ

నవతెలంగాణ-తాంసి

పదవులు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధే గుర్తింపునిస్తుందని ఎంపీడీఓ గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలను పార్టీలకతీతంగా జెడ్పీటీసీ, ఎంపీపీ కార్యవర్గ సభ్యులు అన్ని రకాల అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. ఎటువంటి విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. జెడ్పీటీసీ తమ జెడ్పీ నిధులతో ప్రతి గ్రామానికి తమ నిధులతో సీసీ రోడ్లు, షెడ్ల నిర్మాణాలు బీటీ రోడ్డు నిర్మాణాలు, చేపట్టడం జరిగిందని కొనియాడారు. రాబోయే రోజుల్లో మండలాభివృద్ధి కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ తాటిపల్లి రాజు, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీఓ స్వప్న శీల, వైస్ ఎంపీపీ రేఖా రఘు, సూపరింటెండెంట్ రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ ధనుంజయ్, కార్యాలయ సిబ్బంది, సతీష్‌రావు, సంపూర్ణ, అబ్దుల్ హాది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రైతుబంధుపై రైతుల అభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆలూరు, కౌట్ల(బి) సొసైటీల్లో మంగళవారం సొసైటీ చైర్మెన్లు మాణిక్‌రెడ్డి, నారాయణరెడ్డిల అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభ నిర్వహించి, రైతుబంధు పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక పంట కాలానికి గానూ రూ.7వేల500 చొప్పున రైతులకు ఆర్థిక సాయం చేయుటకు సహకార సంఘం సభ్యులు, రైతుల నుండి రాతపూర్వకంగా తీసుకున్నట్లు సొసైటి చైర్మెన్లు తెలిపారు. రైతుకు ఎంత భూమి ఉన్న 10 ఎకరాలకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలన్నారు. సాగులో ఉన్న భూములకు మాత్రమే ఇవ్వాలని అన్నారు. గుట్టలకు, ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు ఇవ్వద్దని అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు ఎఓ రాజశేఖర్‌రెడ్డి సొసైటి సీఈఓ మల్లేష్, సలీం సిబ్బంది పాల్గొన్నారు.